ఆటల పూదోట

- వివిధ క్రీడాంశాలకు వేదికైన ఇందిర ప్రియదర్శిని స్టేడియం
- ఉత్సాహంగా తర్ఫీదు పొందుతున్న చిన్నారులు
- చురుగ్గా వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణ


క్రికెట్ కోచింగ్‌లో చిన్నారులు

జగదాంబ: ఒకప్పుడు చదువుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. పిల్లలు కొద్దిసేపు ఆడుకోవడానికి వెళ్తే పెద్దవాళ్లు కోప్పడేవారు. 'పక్కింటి రామారావుగారి అబ్బాయిని చూడు.. ఎదురింటి సుబ్బారావుగారి కొడుకుని చూడు చక్కగా చదువుకుంటుంటారు. నీలా పొద్దస్తమానం ఆడుతూ కాలం వృథా చేయరు' అని హితబోధ చేసేవారు. అయితే ఇప్పుడు కాలం మారింది. చదువుతో పాటు క్రీడల్లోనూ పిల్లలు చురుగ్గా పాల్గొంటే చక్కటి ఆరోగ్యం అని వైద్యులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు.


ఇందిర ప్రియదర్శిని స్టేడియం ముఖద్వారం

తల్లిదండ్రుల్లో మార్పు..

వెనుకట్లా కాకుండా ఇప్పుడు పేరెంట్స్ తమ పిల్లలు చదువుతో పాటు ఇతర వ్యాపకాల్లో కూడా చురుగ్గా ఉండాలని భావిస్తున్నారు. క్రికెట్, బాక్సింగ్, షటిల్, వాలీబాల్, క్యారమ్స్, త్రోబాల్ వంటి క్రీడల్లో చేర్పిస్తున్నారు. ఇందుకు వేసవి సెలవులను చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. పిల్లల ఆసక్తిని అనుసరించి సంగీతం లేదా డ్యాన్స్ వంటి వాటిలో చేర్పించి తర్ఫీదు ఇప్పిస్తున్నారు.


త్రోబాల్ ఆడుతున్న బాలికలు


బాక్సింగ్ శిక్షణకు ముందు ఎక్సర్‌సైజ్‌లు చేస్తున్న చిన్నారులు

వేసవి సంరంభం..

వేసవి వచ్చింది.. సెలవులు తెచ్చింది. దీంతో పిల్లలు రకరకాల ఆటలాడుతూ సెలవుల్లో ఖుషీ చేస్తున్నారు. పాతనగరంలోని ఇందిర ప్రియదర్శిని స్టేడియం చిన్నారులకు చక్కటి వేదికగా మారింది. క్రికెట్, ఫుట్‌బాల్, త్రోబాల్ వంటి ఆటలాడుతూ పిల్లలు సంతోషంగా కాలం గడుపుతున్నారు. అలాగే కొందరు క్రీడాకారులు కూడా ఇక్కడ ప్రాక్టీస్ చేస్తున్నారు. వెటరన్ ఆటగాళ్లు ఔత్సాహికులకు ఇక్కడ వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తూ ఉపాధి పొందుతున్నారు.



అకాడమీలో శిక్షణ..

పాతనగరంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో విశాఖ క్రికెట్ అకాడమీ ఉంది. పాత నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే చిన్నారులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. వీరిలో కొందరు చిన్నారులు వివిధ పోటీల్లో కూడా పాల్గొంటున్నారు. ఈ మైదానం క్రికెట్ తర్ఫీదుకు చక్కటి వేదిక అయిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు.

క్రికెట్ నా కల..

క్రికెట్ ఆడాలనే నా కోరిక తీరలేదు. కనీసం అకాడమీ అయినా పెట్టి ఆ కల నెరవేర్చుకోవాలని ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో శిక్షణ ఇస్తున్నాను. ఇప్పటికే కొందరు చిన్నారులు జిల్లా, జోనల్, నేషనల్ స్థాయిలో ఆడుతున్నారు. మరింత మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చి వారు రాణించేలా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నాను. ఆ విధంగా నా కల నెరవేరుతుందని భావిస్తున్నాను.

– సూర్యప్రకాష్, కోచ్, శ్రీఆదరణ చారిటబుల్ క్రికెట్ అకాడమీ

నాడు నేర్చుకున్న విద్యే ఉపాధినిస్తోంది..



మాది పేద కుటుంబం. ఆడుకునే రోజుల్లో పక్కనే ఉన్న ఇందిరా మున్సిపల్ స్టేడియంలో కిక్ బాక్సింగ్ నేర్చుకున్నాను. నేడు అదే ఉపాధిగా మారింది. నేషనల్ స్థాయిలో బాక్సింగ్‌లో గెలిచి, తర్వాత అకాడమీ ఏర్పాటు చేశాను. ఇప్పుడు ఎందరో చిన్నారులకు బాక్సింగ్‌లో శిక్షణ ఇస్తున్నాను. న్యాయనిర్ణేతగా కూడా వ్యవహరిస్తున్నాను.

– దుర్గ, కిక్ బాక్సింగ్ కోచ్

వైద్య శిబిరానికి విశేష స్పందన


పరీక్షలు చేస్తున్న డాక్టర్ సూర్యతేజ

డాబాగార్డెన్స్: స్నేహ సంధ్య ఏజీకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రతి నెలా రెండో గురువారం నిర్వహించే ఈ శిబిరంలో అధిక సంఖ్యలో పాతనగర వాసులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ సూర్యతేజ పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున క్రమం తప్పకుండా మందులు వేసుకుని, సమయానికి ఆహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో పుండరీకాక్షయ్య, ప్రసాద్‌నాయుడు, కమల ప్రియ, సుమతి, సాయి తదితర వైద్య బృందం పాల్గొంది.

గ్రంథాలయాల సమస్యలు పరిష్కరిస్తా

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావు


పిల్లలతో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావు

డాబాగార్డెన్స్: జిల్లాలో ఉన్న గ్రంథాలయాల సమస్యలన్నీ పరిష్కరిస్తామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు హామీ ఇచ్చారు. జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం విశాఖ జిల్లాలో గ్రంథాలయ సంస్థ స్థలాన్ని పరిశీలించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాల పిల్లలకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొని విద్యార్థులు నేర్చుకుంటున్న అంశాలపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. డీసీఎల్‌లోని పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు, రాజేంద్రవర్మ, సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తిగల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌తో కిక్ బాక్సింగ్ టీమ్ భేటీ


మేయర్‌ను కలిసిన విశాఖ కిక్ బాక్సింగ్ టీమ్ సభ్యులు

డాబాగార్డెన్స్: వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించే విషయమై విశాఖ కిక్ బాక్సింగ్ టీం సభ్యులు గురువారం మేయర్ పీలా శ్రీనివాస్‌తో భేటీ అయ్యారు. ఈ మేరకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన పీలాకు పుష్పగుచ్ఛం అందజేశారు. సమ్మర్ క్యాంపుపై చర్చించారు. కార్యక్రమంలో టెంకి దుర్గా, గంటా నూకరాజు, వి. జోగారావు, నీలాపు శ్రీనివాసరావు, వాసుపల్లి సతీష్, కిక్ బాక్సింగ్‌కి సహకరిస్తున్న పలువురు ప్రతినిధులు, జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి మ్యూజికల్ ఫౌంటైన్

మహారాణిపేట: సెంట్రల్ పార్క్‌లో కొంత కాలంగా నిలిచిపోయిన మ్యూజికల్ ఫౌంటైన్ తిరిగి అందుబాటులోకి వచ్చింది. సుమారు రూ. 22.50 లక్షల వ్యయంతో ఆధునికీకరించిన ఫౌంటైన్‌ను గురువారం ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస యాదవ్, చైర్మన్ ఎంపీ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ సీహెచ్ విశ్వనాథన్‌తో కలిసి ప్రారంభించారు. నూతన పాటలతో రూపొందించిన ఈ ఫౌంటైన్ సెంట్రల్ పార్క్‌కు వచ్చే సందర్శకులకు అదనపు ఆకర్షణ అని చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు. దీనివల్ల పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతుందని మెట్రోపాలిటన్ కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ భవానీ శంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

గణితంలో మెలకువలపై విద్యార్థులకు శిక్షణ


వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు గణితంలో మెలకువలు నేర్పించారు. గణిత ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు పాల్గొని గణిత సమస్యల పరిష్కారానికి సంబంధించిన సులువైన మార్గాలను సూచించారు. గణితంలోని చతుర్విధ పరికర్మలను చేసే విధానాన్ని వివరించారు. మ్యాథ్స్‌లో ప్రావీణ్యం సాధిస్తే ఇతర సబ్జెక్టుల్లో బాగా రాణించవచ్చని చెప్పారు. గణితాన్ని చూసి భయపడకూడదని ఇంతటి సులువైన సబ్జెక్టు మరొకటి ఉండదని పేర్కొన్నారు. నిత్యజీవితంలో గణితం మన వెంటే ఉంటుందని వివరించారు. విద్యార్థులు అడిగిన పలు సమస్యలను సులువుగా పరిష్కరించి గణితంపై ఆసక్తిని పెంచారు. లైబ్రేరియన్ వై.పద్మజ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన

మద్రిపాలెం: ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవ జాతికి, జంతు జాలానికి కలిగే అనర్థాలపై జీవీఎంసీ అధికారులు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 50వ వార్డులోని పలు షాపుల యజమానులు, వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సెక్రటరీలు, సూపర్‌వైజర్లు చిరంజీవి, గణేష్, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించండి


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూడాలని యూసీడీ విభాగం అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో గురువారం యూసీడీ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో ఏ ఏ కేటగిరీల్లో ప్రభుత్వ పింఛన్లు ఎన్నెన్ని పంపిణీ చేస్తున్నారని ఆరా తీశారు. నైట్ షెల్టర్లు రాత్రి 11 గంటల తర్వాత అధికారులు తనిఖీ చేయాలన్నారు. అన్నా క్యాంటీన్లను అధికారులు సందర్శించి భోజనం నాణ్యతను పరిశీలించాలని, నైట్ షెల్టర్లతో పాటు అన్న క్యాంటీన్లు ఆకస్మికంగా తాను తనిఖీ చేస్తానని తెలిపారు. చాలా చోట్ల టిడ్కో గృహాలు ఖాళీగా ఉన్నాయని, గృహాల జాబితా, వివరాలు అందించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రాజెక్టు డైరెక్టర్ (యూసీడీ) సత్యవేణి, ప్రాజెక్టు ఆఫీసర్లు డి. లక్ష్మి, సూర్యకళ, డీపీవోలు హనుమంతు శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక సంఘాల ఐక్యతతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట


ప్రతిజ్ఞ చేస్తున్న మైనారిటీ కార్పొరేషన్ ఈడీ శంసున్నీసా బేగం, ధార్మిక సంఘాల ప్రతినిధులు

సీతంపేట: ధార్మిక సంఘాల ఐక్యతతో బాల్య వివాహ రహిత విశాఖ జిల్లా సాధ్యమని మైనారిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిప్యూటీ కలెక్టర్ శంసున్నీసా బేగం అన్నారు. అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ 'యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్' అనే ప్రాజెక్టులో భాగంగా అన్ని వర్గాల ధార్మిక సంఘ నాయకులకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధంలో ధార్మిక సంఘాలు ముఖ్య పాత్ర పోషించాలని కోరారు. మైనారిటీ సంక్షేమ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తెలియచెప్పడం ఎంత అవసరమో తెలిసిందన్నారు. పురోహిత సంఘ ప్రతినిధి ఆర్. రామారావు మాట్లాడుతూ బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ద్వారా మాకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయన్నారు. క్రిస్టియన్ సమాజ ప్రతినిధులు రెవరెండ్ ఇమ్మానుయేల్ సువర్ణరాజు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికలు బాల్యాన్ని, విద్యను కోల్పోతున్నారని, ఎట్టి పరిస్థితుల్లో వీటిని ప్రోత్సహించరాదన్నారు. అప్‌హోల్డ్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ జి.డేవిడ్‌రాజు మాట్లాడుతూ తమ సంస్థ జిల్లా, గ్రామ స్థాయిలో ప్రతి స్కూల్, కళాశాలలో బాల్య వివాహాల నిషేధంపై అనేక కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. బాల్య వివాహాల నిషేధానికి కృషి చేస్తామని ధార్మిక సంఘ నాయకులంతా ప్రతిజ్ఞ చేశారు. రెవరెండ్ సూర్యకిరణ్, చక్రవర్తి, కె.వై.రత్నం పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభం పునఃప్రతిష్ట


రామలింగేశ్వరాలయంలో ధ్వజ స్తంభం పునఃప్రతిష్ఠ


ధ్వజ స్తంభం పునఃప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణ, భక్తుల శివన్నామస్మరణ నడుమ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గవ్యాంత పూజలు, శేష హోమాలు, యంత్రార్చన, బలిహరణ, యంత్రస్థాపనం, గోదర్శనం, కళాన్యాసములు, కుంభాభిషేకం జరిపించారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

25 శాతం ఉచిత అడ్మిషన్లు అమలు చేయాల్సిందే


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయ భాస్కర్

గాజువాక: నూతన విద్యా హక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రతి పాఠశాలలో 25 శాతం ఉచిత అడ్మిషన్లను అమలు చేయాల్సిందేనని పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు బి.విజయ భాస్కర్ అన్నారు. ఉచిత అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుందని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ, బాధ్యతల అంశంపై స్కూల్స్ కరస్పాండెంట్లతో గాజువాకలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ప్రైవేట్ స్కూల్స్ కూడా భాగమేనని, అందువల్ల ప్రభుత్వం సూచించిన ప్రతి విషయాన్ని తప్పకుండా అమలు చేయాలని అన్నారు. పాఠశాలల నిర్వహణలో ప్రధానమైన రికార్డుల నిర్వహణను సక్రమంగా చూసుకోవాలన్నారు. విద్యార్థుల పూర్తి వివరాలు, మార్కులు తదితర సమాచారాన్ని ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లో కూడా సకాలంలో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు, గాజువాక, పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారులు విశ్వనాథం, సునీత, రమణాజీ, జిప్సా నాయకులు పి.భాస్కరరావు, బి.శ్రీనివాసరావు, ఎం.బాబూరావు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని స్లీప్‌గుర్తువీధి, మాన్యువల్‌స్ట్రీట్, రొసీలియన్ స్ట్రీట్‌లో మంచినీటి పైపులైన్లు కలుషితం అవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పైప్‌లైన్లకు సమీప కాలువల్లో మురుగు చేరడంతో ఆ పైప్‌ల ద్వారా ఇళ్లలోకి మురుగు నీరు సరఫరా అవుతుందని, ఈ విషయం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమకు ఫిర్యాదు చేశారు. ఆమె సంబంధిత మంచినీటి విభాగం అధికారులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ పర్యవేక్షణలో మంచినీటి సిబ్బంది డ్రైనేజీల్లో ఉన్న పైప్‌లైన్ల తొలగింపు పనులు చేపట్టారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి మంచినీరు సరఫరా అయ్యేటట్లు చూస్తామని ఏఈ సుమన్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వేళంగిణి రావు, మురళి, కుమార్, మంచినీటి విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్లీప్‌గుర్తు వీధిలో పైప్‌లైన్ల మరమ్మతు చేస్తున్న సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: హెచ్‌టీ లైన్ల (11కేవీ) మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్–1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొబ్బరితోట, జెండా చెట్టు, అచ్చియ్యమ్మపేట, భూపేష్‌నగర్, అల్లిపురం, నేరేళ్లకోనేరు, కర్నాలవీధి, అల్లిపురం రైల్వే స్టేషన్ రోడ్డు, అల్లిపురం సిగ్నల్ పాయింట్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీసీ రోడ్, కాలువల నిర్మాణం


వెంకటేశ్వరకాలనీలో జరుగుతున్న సీసీ రోడ్ నిర్మాణ పనులు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు వెంకటేశ్వరకాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు, సీసీ కాలువ (డ్రెయిన్)లను నిర్మిస్తున్నారు. రైల్వే న్యూ కోలనీ రోడ్ నుంచి వెంకటేశ్వర కాలనీకి వెళ్లే మార్గాన్ని రూ.14 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. అధ్వానంగా ఉన్న డ్రెయిన్లు తొలగించి వాటి స్థానంలో కొత్తగా డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. నూతన రహదారి, డ్రెయిన్లతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కంచరపాలెం రైతుబజార్‌లో కొత్త దుకాణాల నిర్మాణం


రైతుబజార్‌లో నిర్మిస్తున్న దుకాణాలు

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్‌లోని నేల దుకాణాలకు మార్కెటింగ్ శాఖ అధికారులు మోక్షం కలిగించారు. ఇటీవల వార్తా పత్రికల్లో నేలబారు దుకాణాలు అంటూ కథనాలు వెలువడటంతో ఆ దిశగా అధికారులు స్పందించారు. దుకాణాల నిర్మాణానికి టెండర్లు పిలవడంతో కాంట్రాక్టర్లు ముందుకొచ్చి పనులు ప్రారంభించారు. నేల దుకాణాలకు షెడ్లు, అదనపు దుకాణాలు నిర్మిస్తున్నట్లు కంచరపాలెం రైతుబజార్ ఈవో జగదీశ్వరావు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రైతులకు దుకాణాలను అందుబాటులోకి తెస్తామన్నారు.

అందరి భాగస్వామ్యంతో గ్రంథాలయాల అభివృద్ధి


ఏయూ లైబ్రరీ అధికారులు, సిబ్బందితో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ వెంకటేశ్వరరావు

విశాఖ విద్య: భావితరాలకు ఉపయోగపడేలా గ్రంథాలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలోని డాక్టర్ వీఎస్ కృష్ణా లైబ్రరీని గురువారం ఆయన సందర్శించారు. అక్కడున్న సౌకర్యాలను పరిశీలించారు. తాళపత్ర గ్రంథాలను పరిశీలించి, భావితరాలకు చరిత్ర తెలిసేలా వీటిని భద్రపరచడం అభినందనీయమన్నారు. అందుబాటులో ఉన్న పుస్తకాలు, ఇంకా ఏమైనా వసతులు కల్పించాలనే దానిపై లైబ్రరీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విశాఖ నగర గ్రంథ పాఠకులతోపాటు ఏయూ క్యాంపస్ కాలేజీల విద్యార్థులకు డాక్టర్ వీఎస్ కృష్ణా లైబ్రరీలో అందుబాటులో ఉన్న పుస్తకాలు ఎంతో సౌలభ్యంగా ఉన్నాయని చైర్మన్ దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. పోటీ పరీక్షార్థుల కోసం ఏర్పాటు చేసిన స్టడీ హాల్, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు.

రైతుబజార్‌లో తూనికలు, కొలతలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న జిల్లా లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ అధికారులు

ఎంవీపీకాలనీ: జిల్లా లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ లీగల్ కంట్రోలర్ రవికుమార్, పలువురు విభాగాధికారులు రైతులు, వినియోగదారులకు తూనికలు, కొలతలపై అవగాహన కల్పించారు. రవికుమార్ మాట్లాడుతూ కూరగాయల తూకల్లో తేడాలను వినియోగదారులు గుర్తించాలన్నారు. కూరగాయలు, ఇతర వస్తువులను కొనే సందర్భంలో తూకల్లో జరిగే మోసాలను విపులంగా వివరించారు. ఎలాంటి మోసాన్ని గుర్తించిన స్థానిక తూనికలు, కొలతల విభాగం అధికారులతో పాటు రైతుబజార్ ఈవో దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో విభాగ ఇన్‌స్పెక్టర్ రామారావు, మర్రి సత్యనారాయణ, రైతుబజార్ ఈవో వరహాలు, వినియోగదారుల సంఘం ప్రతినిధులు సత్యకుమార్, భాస్కర్‌రావు, సెయింట్ జోసఫ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మద్దిలపాలెం: ఈ నెల 20న తలపెట్టిన అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడ జోన్ కమిటీలు పిలుపునిచ్చాయి. మద్దిలపాలెం కార్యాలయంలో గురువారం సమ్మె పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.వెంకటరావు, డి.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇవి అమలైతే కార్మిక వర్గం అనేక హక్కులను కోల్పోతుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించరాదని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు నరేంద్రకుమార్, రాజ్‌కుమార్, ఐసీ నాయుడు, ఎ.సింహాచలం, లక్ష్మణరావు, వెంకటరమణ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.